

# ఝాన్సీరాణి

రచన : శ్రీ ఐతాచంద్రయ్య

(గత సంచిక తరువాయి)

'ప్రైజు వచ్చిందట, బధాయీభాయ్' అంటూ రవీందర్ సింగ్ చక్రధర్ భుజం తట్టాడు.

'ధన్యవాద్ భాయ్ తెలుగు ఇంకాసరిగా మాట్లాడాలి' చక్రధర్ సలహా ఇచ్చాడు.

'ష్యూర్ భాయ్' అంటూనే తానెక్కవలసిన సిటీబస్సు వైపు పరుగెత్తాడు రవీందర్‌సింగ్.

'అలాపార్కు కెళ్లామా?' అడిగింది ఝాంసీ కళ్ళను చక్రాల్లా తిప్పుతూ.

పరేడ్ మధ్యలో స్వల్పవిశ్రాంతి తీసుకుంటున్న మిలటరీ బటాలియన్ లాగుంది పార్కు. అమావాస్య చీకటి తెరల్ని మెర్క్యూరీ లైట్ల వెలుగులుతరు ముతున్నాయి. ఆకాశ ముంగిట్లో చుక్కల ముగ్గులు అందంగా కన్పడుతున్నాయి. రకరకాల పుష్పరాజాలు సువాసనల గుబాళింపుల్తో తమ ఉనికిని తెల్పుకుంటున్నాయి. వాటి వైపు చూడగానే కిలకిలా నవ్వుతున్నాయి.

చక్రధర్, ఝాంసీరాణి పార్కులో కూర్చొని నలుమూలలా పరిశీలిస్తున్నారు. పెదవివిప్పక మూగనోమునా చరిస్తున్నారు.

చక్రధరే ధైర్యంచేసి ఆమెవైపు చూచాడు.

'చెప్పు ఝాంసీ విశేషాలు...'

మౌనం.

'ఏమిటాలోచిస్తున్నావ్? మన పరీక్షలు...'

'అదేంకాదు చక్రధర్, ఈరోజు నాకెంతో సంతోషంగా ఉంది' తన్మయత్వంతో అంది ఝాంసీరాణి.

'దేనిగురించి?'

'నా చక్రధర్‌ను కవిగా క్రికెటీర్‌గానే చూచానింత వరకు...'

'మరిప్పుడు!'

సిగ్గులు సింగారించిన ముఖాన్ని పైకెత్తి-

'అబ్బా! ఏమిటి చక్రధర్! అన్నీ నాతోనే చెప్పించాలనా? నిజంగాచెప్పు నాగురించి నీవే మాలోచిస్తున్నావో?' నిలదీసింది.

'నిజమే ఝాంసీ, నిన్ను గుండెల్లో దాచుకున్నాను... ఆరాధిస్తున్నాను. కాని...కాని...'

ఝాంసీరాణి గులాబిచేతులతన్నింక మాట్లాడ నీయలేదు. అతని మాటలు వరాల మూటల్లా తోచాయి. శతకోటి సంగీతనాదాలు వినిపించినాయ్.

'రేపోసారి మాయింటికి రావాలి చక్రధర్?'

'రాణిగారి ఆజ్ఞ జవదాటగలనా?'

ఇద్దరూ నవ్వుకున్నారు.

O O O

ఇంట్లో ప్రవేశించగానే నిశ్శబ్దం ఆహ్వానించింది. చిన్న సైజు భూగోళంలాగుంది బంగళా. మిరుమిట్లు గొల్పే గోడల రంగులు గంభీరతను పులుముకున్నాయి. రెండుసోఫాసెట్లు కాపలాకాస్తున్న వస్తాదుల్లాగా గోచరించాయి చక్రధర్‌కు.

'నమస్తే జీ...ముకుళిత హస్తాలు పైకిలేచినయ్, ఠీవిగా వస్తున్న ఓ పెద్దమనిషిని చూచి తన ఝాంసీగూడా ఆయన వెంటనే ఉంది. తిప్పిన మీసాలు, అంగసౌష్టవం అబ్బుర పరిచేలాగున్నది. కొత్తవారెవరైనా చూస్తే దడుసుకునే అవకాశముంది.

మీ కొరకు....

మేము

తయారిస్తున్న

SNH

శ్రీ నిత్యా బనియన్లు

* బనియన్లు

* జెట్టీలు

* ఫేన్సి కలర్ రకాలు

——: తయారించువారు :——

**SRI NITHYA HOSIERIES**

11-C, Ramaiah Colony
TIRUPUR-638 602.

Stockists :

G. K. Banians

Vastralatha, Vijayawada-520 001.

ఝాంసీలేడి కళ్ళు పెదాల్ని ముసిముసి నవ్వులతు పురికొల్పాయి.

'వీరు చక్రధర్‌గారు మా క్లాస్‌మేట్ నాన్నా! మంచి క్రీడాకారుడు, అంతకు మించి, ఓ మాంచికవి గూడా. ఈ మధ్యనే...'

పరిచయవాక్యాలు పెంచనీయలేదు చక్రధర్.

'చాల్చాలు నాగురించి' అన్నాడు.

'వీరు మా నాన్నాగారు...రఘువర్‌సింగ్ మిలటరీలో పన్జేసి ఈమధ్యనే రిటైరయ్యారు...తండ్రిని పరిచయం చేయగానే-

'నమస్కారమండీ...అన్నాడు మర్యాదకని మరోసారి

'నమస్కారం...చాలాసంతోషం బాబూ!' అంటూ పెద్దమనిషి చక్రధర్నోసారి ఆపాదమస్తకం తేరిపార చూచి, తను కూర్చుంటూ అతన్నిగూడా కూచోమని చేత్తో సైగచేశాడు.

'మీ ప్రేమ వ్యవహారం మా అమ్మాయి చెప్పింది బాబూ! కాని నీ కులం గోత్రం గురించి మాత్రం తెలీదండి. మా జాంసీ ఎంతభోళా మనిషో చూడు. ఎలా బ్రతుకుద్దో ఏమో?' అంటూ ఓ నవ్వు నవ్వేశాడు.

ఆయన నవ్వుతూంటె క్షత్రియు ఠీవి కన్పించింది.

'ఈ రోజుల్లో కులంపట్టింపు లెవరి కున్నాయండీ? ఐనా అడిగారు కాబట్టి చెబుతున్నాను. నేను హరిజనున్ని మా నాన్నగారు వ్యాపారం చేస్తున్నారు. మా అన్నయ్య తాసిల్దారుగా పన్జేస్తున్నారు. మా వూళ్ళో సొంతఇల్లూ, పొలం ఉన్నాయి' చక్రధర్ చెప్పుకుపోతూంటె జాంసీ గూడా వింటూంది చిరునవ్వుతో.

ముసలాయన ముఖకవళికలు మారాయి.

'మేము క్షత్రియులం బాబూ! మీ కులం సంగతి తెలియక మా అమ్మాయేదో ఊహించుకుని పొరపడినట్టుంది. చిన్నపిల్లగదా, దానికేం తెలుస్తుంది! ఆఁ...బాగా చదువుతున్నావా? పరీక్షలు దగ్గర్లో ఉన్నాయికాబోలు...మాట మార్చాడు.

చక్రధర్, జాంసీరాణి విస్మయంతో ముఖాలు చూచుకున్నారు.

'మీ ఉద్దేశ్యం నాకర్థంకాలేదు. ప్రేమకు కులాలడ్డొస్తా యాండీ?' ఆందోళనతో ప్రశ్నించాడు చక్రధర్.

'రావు. కాని పెళ్ళివరకూ వచ్చేసరికిలాంటి వన్నీ ఆలో చించక తప్పదు. ఒకేకులంవారు ప్రేమించుకుంటే ఎంచక్కా పెళ్ళౌతుంది. కాకపోతే దోమగా...మలేరియా దోమగా మారుతుందా ప్రేమ' కటువుగా సమాధానమిచ్చాడు రఘు వర్‌సింగ్.

చక్రధర్ ప్రయత్నం చెదిరిపోలేదు. పట్టువిడువలేదు.

'మన వర్ణవ్యవస్థలు వృత్తినిబట్టి నిర్ణయించినవే గాని పురోచికాదండి. మన శాస్త్రాల్లో కులాలులేవు కొందరు స్వార్థపరుల విచిత్రసృష్టే ఈ కులాలు'

'గుడ్డొచ్చి పిల్లనెక్కిరించిందట. కాకమ్మకబుర్లతోని పనులుకావు'

'కాకమ్మ కబుర్లుకావండి'

'లేకపోతే కోయిల కూతలా? నివేక్షత్రియుడునౌతే, మేమే హరిజనులమైతే ఈ నీతులు, జాతక కథలు నీనోటి నుండి వచ్చేవికావు'

'అరుంధతీ...పతివ్రత దేకులమో తెలుసాండి?'

'నేనవన్నీ వినదల్చుకోలేదు. క్షత్రియకులంలో పుట్టి నా కూతుర్నో హరిజనుడికి ముడిబెట్టాలా? నీవు చెప్పే వన్నీ నవలలకూ, సినిమా కథలకూ అలంకారాలు. ఐనా నీ కెంత ధైర్యం? మీసంపైద చేయివేసి అడిగినాడు.

జాంసీరాణి కోపంగా లేచివచ్చి తండ్రి ముందు సీట్లో కూచుంది.

'ఇదేమిన్యాయం నాన్నా? మీరిలా మాట్లాడుతారనుకో లేదు' ధైర్యంనోరును, భయం నొక్కేస్తూంది.

రఘువీర్‌సింగ్ గుడ్లెఱ్ఱజేసి ఆమెవైపు చూచాడు. 'నీ కింత ధైర్యమెక్కడి నుండి వచ్చింది. తక్షణం ఇక్కడి నుండి లేచిపో...' గర్జించాడు.

జాంసీరాణి బెదరిన లేడిపిల్లలా కళ్ళనీళ్ళు తుడుచు కుంటూ వెళ్ళిపోయింది.

నాల్రోజుల తర్వాత తెలిసింది. జాంసీరాణి పెళ్ళి రవీం దర్‌సింగ్‌తో సెటిలైందని. ఝాంసీరాణి కాలేజికి రావడం మానేసింది. కొద్దిరోజుల్లోనే పరీక్షలు ప్రారంభమైనాయి.

చివరి పరీక్షకాగానే రవీందర్‌సింగ్ తన క్లాసుమెట్సం


With best compliments from :

THERE IS JOY

WHERE THERE IS

HIGH PRESSURE WATER SYSTEM




**JOTHI**

**Engineering Works**

INDUSTRIAL ESTATE,

MADURAI-625 007.

దరికి శుభలేఖలు పంచాడు. చక్రధర్ శుభలేఖ చూచి—

'కంగ్రాచ్యులేషన్స్ భాయ్' అన్నాడు.

రవీందర్‌సింగ్ చిరునవ్వు నవ్వాడు.

'ఔను, రవీ...! ఆమధ్య ఆరోగ్యం బాగాలేదన్నారు. ఇప్పుడెలాగుంది?' అనడిగాడు.

'ఇప్పుడు బాగానే ఉందిగురూ ఎల్లుండే పెళ్ళి. తప్పక రావాలిసుమా' అంటూమరీమరీ చెప్పాడు.

తెల్లవారే వాళ్ళూరువెళ్లాననుకున్న చక్రధర్ పెళ్ళయ్యే దాకా ఉన్నాడు. వాళ్ళపెళ్ళని కళ్ళారాచూచి జాంసీ బేలతనానికి నవ్వుకున్నాడు.

వాళ్ళూరు వెళ్ళగానే చాలా పెళ్ళి సంబంధాలు వచ్చాయి. వాళ్ళమ్మా నాన్నలు పెళ్ళిచేసుకొమ్మని బలవంతం చేశారు.

O O O

బాలభాస్కరుని బంగారుకిరణాలు భూదేవిని గిలిగింతలు పెడుతున్నాయి. కిటికీగుండా బలవంతంగా తోసుకువచ్చి జాంసీరాణి బుగ్గల్ని ముద్దుపెట్టుకున్నాయి. రాత్రికి అల్లిబిల్లి ఆలోచనల్తో ఆలస్యంగా నిద్రపట్టింది. చురుక్కుమనగానే బురుక్కునలేచింది. త్వరత్వరగా తయారై బయలుదేరింది.

ఇల్లు కనుక్కోవడం కష్టంకాలేదు. బయట సైన్ బోర్డుంది తలుపు తట్టగానే తెరుచుకుంది.

'వెల్‌కం జాంసీరాణీ!' ఆప్యాయంగా ఆహ్వానించాడు చక్రధర్.

స్నానానికి బయలుదేరుతున్నాడు కాబోలు భుజంమీద తువ్వాలుంది. షర్టులేదు.

'ఐదు నిమిషాలు...కూచో ఇప్పుడే వస్తాను' కుర్చీచూపించి లోనకెళ్ళాడు.

మాగజైన్ చూస్తూంటె అందులో చక్రధర్ కవిత కన్పించింది. చదివింది. అదే అనుభూతితో ఇల్లంతా పరిశీలించింది కళ్ళతోనే. చక్రధర్ అదృష్టవంతుడు. మంచి ఇల్లాలు దొరికింది. కాబట్టె ఇల్లును ఇంతఅందంగా ఉంచింది. గోడలమీద ఫోటోలు ఓపద్ధతి ప్రకారం అలంకరించబడ్డాయి. క్రికెట్ పోటీల్లో గెలిచి ప్రైజులు తీసుకుంటున్న సమయంలో, కవిసమ్మేళనాల్లో సన్మానాల సమయాల్లో తీసినవి. మరేదో ఫోటోకొరకు వెతుకుతున్నాయి ఝాంసీ రాణి కళ్ళు కాని కనబడలేదు. (సశేషం)

With best compliments from :

Phone : 26065 Tel. : " SANTHI STAR"

**Santhi Diamonds**

Props : B. K. N. KANNAN & SONS

37, Big Sowrastra Street, TIRUCHIRAPALLI - 620 008.

శాంతి వజ్రములు

మేము అత్యుత్తమైన బెర్‌లీన్ స్టార్ డబుల్ కటింగ్

శాంతి స్టార్ కమలములు మీ నగలకు అతి ప్రకాశాన్నిచ్చే రీతిగా

తయారిస్తున్నాము.

రసాయనిక వజ్రాలను తయారించుటలో

మాదొక ప్రత్యేకత